క్లుప్తంగా

నేడు ఎల్‌సీ గేటుకు మరమ్మతులు

కంచిలి: మండల కేంద్రం కంచిలి నుంచి గొల్ల కంచిలి, పురుషోత్తపురం, ఎస్.ఆర్.సి.పురం తదితర గ్రామాలకు రాకపోకలు సాగించే మార్గంలో ఉన్నటువంటి రైల్వే ఎల్‌సీ గేటుకు గురువారం మరమ్మతులు చేపట్టనున్నారు. దీంతో మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు గేటును పూర్తిగా మూసివేయనున్నారు. ఈ విషయమై స్థానిక సర్పంచ్ లండ లక్ష్మికి రైల్వే శాఖ అధికారులు సమాచారం ఇచ్చారు. ప్రజలంతా గమనించి సహకరించాలని సర్పంచ్ కోరారు.

కిశోర్ బాలికల సంరక్షణ అందరి బాధ్యత


మాట్లాడుతున్న సీడీపీవో పార్వతి

పలాస: కిశోర్ బాలికల సంరక్షణ అందరి బాధ్యతని కాశీబుగ్గ ఐసీడీఎస్ సీడీపీవో కవిటి పార్వతి అన్నారు. పలాస మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం కిశోర్ వికాసంపై అవగాహన సదస్సును నిర్వహించారు. బాలికల్లో వచ్చే శారీరక, మానసిక మార్పులను అవగాహన చేసుకునేలా వారికి తగిన అవగాహన కల్పించడంతోపాటు ధృడమైన వ్యక్తులుగా తీర్చి దిద్దే బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎంపీడీవో వసంతకుమార్, రెంటికోట పీహెచ్‌సీ వైద్యాధికారి సునీల్ కుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పరామర్శ

కంచిలి: బూరగాం గ్రామానికి చెందిన మడ్డు వీరాస్వామి అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో అతని కుటుంబాన్ని ఎమ్మెల్సీ నర్తు రామారావు బుధవారం పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మడ్డు వెంకటరావు, మద్దిలి భీమారావు, మస్తీల మన్మథరావు, మడ్డు అభి, బొట్ట చిన్నయ్య, కాంగ్రెస్ నాయకుడు పిల్లల లింగరాజు ఉన్నారు.

కవిటి: లండారపుట్టుగకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త మామిడి లచ్చయ్య తల్లి పొట్టెమ్మ చనిపోయారు. దీంతో ఆమె కుటుంబాన్ని ఎమ్మెల్సీ నర్తు రామారావు పరామర్శించి సంతాపం తెలియజేశారు.

పంపు హౌస్ పరిశీలన

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ జంట పట్టణాలకు మంచినీరు అందించే బావులను మున్సిపల్ కమిషనర్ నడిపేట రామారావు బుధవారం పరిశీలించారు. కాశీబుగ్గ జగన్నాథ సాగరం వద్ద ఉన్న రెండు బావులు, పంప్ హౌస్, మిషనరీలు, ట్యాంకర్లను తనిఖీ చేశారు.

మృతుని కుటుంబానికి అండగా..

ఇచ్ఛాపురం రూరల్: కేశుపురం గ్రామానికి చెందిన ఇరోతు రామారావు ఇటీవల మృతి చెందారు. ఇతనికి భార్య, ఇద్దరు చిన్నపిల్లలు ఉన్నారు. వీరు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నట్టు తెలుసుకున్న స్థానిక కాశీమాత సేవా సమితి సభ్యులు స్పందించారు. 25 వేల రూపాయలను సేకరించారు. ఈ మొత్తంతోపాటు నిత్యావసర సరుకులను రామారావు భార్యకు బుధవారం అందజేశారు.

మహిళల కొవ్వొత్తుల ర్యాలీ

ఇచ్ఛాపురం రూరల్: ఆడబిడ్డకు రక్షగా కదులుదాం అంటూ అరకబద్ర గ్రామానికి చెందిన స్వయం సహాయక సంఘ మహిళలు బుధవారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. సీసీ మోహనరావు, వీవోఏ స్వాతిలు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

ఇచ్ఛాపురం రూరల్: తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు అప్రమతగా ఉండాలని తహసీల్దార్ ఎస్.వెంకటరావు, వ్యవసాయాధికారి టి.భార్గవిలు సూచించారు. బుధవారం మండలంలోని పంట పొలాల్లో పర్యటించి రైతులతో మాట్లాడారు. వరి కోతలు ఆపాలని, ఇప్పటికే కోతలు కోస్తే వాటిని సురక్షిత ప్రాంతాల్లోకి తరలించి కుప్పలు వేసి సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో పౌరసరఫరాల అధికారి కె.సంతోష్, రెవెన్యూ అధికారులు, వీఆర్వోల పాల్గొన్నారు.

వరికోతలు వద్దు

సోంపేట: తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో మూడు రోజులు వరికోతలు చేపట్టవద్దని ఆర్డీవో జి.వెంకటేష్ రైతులకు సూచించారు. బారువలో వ్యవసాయ, రెవెన్యూ అధికారులతో కలిసి బుధవారం పర్యటించి రైతులతో మాట్లాడారు. వరి పంటను రక్షించుకోవడానికి జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సోంపేటలో రెవెన్యూ పెట్రోల్ బంక్, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలకు స్థల పరిశీలన చేశారు. తహసీల్దార్ బి.అప్పలస్వామి, ఏడీఏ కె.జగన్మోహనరావు, వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి, డీటీ ఎం.ఉమామహేశ్వరరావు ఉన్నారు.

ఎస్పీని కలిసిన సోంపేట ఎస్‌ఐ


ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్సై లోవరాజు

సోంపేట: సాధారణ బదిలీల్లో భాగంగా సోంపేట ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన వి.లోవరాజు బుధవారం జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి, మాదక ద్రవ్యాల నియంత్రణ, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎస్పీ సూచించారు.



50 ప్యాకెట్ల బియ్యం వితరణ

కంచిలి మండలం మండపల్లి గ్రామంలోని సీతయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వానప్రస్థాశ్రమంలో అనాథలు, వృద్ధులు, దివ్యాంగులు, విద్యార్థుల నిత్య అన్నదాన సేవార్థం ఇచ్ఛాపురం మండలం ధర్మపురం గ్రామానికి చెందిన పిట్ట వాసు 50 ప్యాకెట్ల బియ్యాన్ని వితరణ చేశారు. వీటిని ఆశ్రమ నిర్వాహకులకు బుధవారం అందజేశారు. అనాథలు, వృద్ధులు, మిగతా వారికి పండ్లను పంచిపెట్టారు. ఇచ్ఛాపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి దాసరి రాజు, ఇసుకలపాలెం సర్పంచ్ బైపల్లి ఈశ్వరరావు, ఆశ్రమ నిర్వాహకులు గుళ్ల రమేష్ ఉన్నారు. –కంచిలి



పొలం పిలుస్తోంది

ఇచ్ఛాపురం రూరల్ మండలం టి.బరపురం పంచాయతీలో బుధవారం రైతులతో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి ఎంపీపీ బోర పుష్ప హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం వరికోతలు జరుగుతున్నందున నూర్పులకు అవసరమైన పరదాలను ప్రభుత్వం రైతులకు రాయితీపై అందించాలని కోరారు. మండల వ్యవసాయాధికారి టి.భార్గవి మాట్లాడుతూ పంట కోత దశకు చేరుకున్నందున రైతులు వరికోతలు కోసే సమయంలో యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. సర్పంచ్ కారంగి త్రినాథ్‌రెడ్డి పాల్గొన్నారు. –ఇచ్ఛాపురం రూరల్



మాదక ద్రవ్యాలపై అవగాహన

మాదక ద్రవ్యాలతో యువతకు ప్రమాదం పొంచి ఉందని వజ్రపుకొత్తూరు ఎస్ఐ కె.నిహార్ అన్నారు. దీని నిర్మూలనకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని, చెడు వ్యసనాలకు బానిసలు కావద్దని కోరారు. వజ్రపుకొత్తూరు మండలం పాతటెక్కలి ఉన్నత పాఠశాలలో మాదక ద్రవ్యాలతో కలుగు నష్టాలపై విద్యార్థులకు 'సంకల్పం' అనే కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పించారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకుని ముందుకు సాగాలన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు. –వజ్రపుకొత్తూరు



ఆర్థిక సహాయం అందజేత

సంతబొమ్మాళి మండలం గోవిందపురం గ్రామానికి చెందిన మర్ల సవరయ్య, వల్లేవలసకు చెందిన కోటి అనారోగ్యంతో బాధపడుతున్నారు. వీరికి రెయ్యి వసంతరెడ్డి కుటుంబసభ్యులు ఆర్థిక సహాయం బుధవారం అందజేసి అండగా నిలిచారు. గుండెకు రెండు స్టంట్స్ పడిన కారణంగా నిరుపేద సవరయ్యకు రూ. 11వేలు, కోటికి ఆరోగ్యం బాగోలేని కారణంగా రూ. 5 వేలు నగదు, 10 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులను స్థానిక సర్పంచ్ రెయ్యి రామిరెడ్డి, ఆర్. ప్రసాద్‌రెడ్డి చేతులు మీదుగా అందజేశారు. బాధితులకు దాతకు కృతజ్ఞతలు తెలియజేశారు. – సంతబొమ్మాళి

బడి వంట ▸ ధరల మంట!

- భారంగా మధ్యాహ్న భోజనం
- మండుతున్న నిత్యావసరాల ధరలు
- మూడు నెలలుగా అందని గౌరవ వేతనం

ఇచ్ఛాపురం రూరల్:


భోజనాలు చేస్తున్న బాలికలు

విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకానికి నిత్యావసర ధరల పెరుగుదల శరాఘాతంగా మారింది. పెరుగుతున్న ధరలకు తగ్గట్టు ప్రభుత్వం బడ్జెట్ పెంచడం లేదు. దీంతో విద్యార్థులకు అందిస్తున్న భోజనంలో నాణ్యత తగ్గుతోంది. పౌష్టికాహారం అందక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టు మూడు నెలలుగా వంట నిర్వాహకులకు గౌరవ వేతనం రాలేదు. సామాన్య మధ్య తరగతి ప్రజలతో పాటు పాఠశాలలకు కూడా ధరల మంట తగులుతోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెదపీట వేసి, మనబడి నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలల రూపు రేఖలు మార్చింది. దీంతో పాటు పౌష్టికాహారంతో కూడిన ఆహారాన్ని అందించేంది. అప్పట్లో తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ బడులకు పంపేందుకు ఆసక్తి చూపేవారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో నిత్యావసరాలతో పాటు అన్ని రకాల ధరలూ ఆకాశాన్నంటుతున్నాయి. దీంతో ఏజెన్సీ నిర్వాహకులకు వంట భారంగా మారింది. అప్పుచేసి పిల్లలకు భోజనాలు వండి పెడుతున్నారు. బిల్లులు సకాలంలో అందక నిర్వాహకులు అవస్థలు పడుతున్నారు. ఫలితంగా రుచికరమైన, నాణ్యమైన భోజనం పిల్లలకు అందడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

మెనూ ఇలా..

సోమవారం నుంచి శనివారం వరకు అన్నంతో పాటు పప్పుచారు, పులిహోరా, టామాటా, విజిటబుల్ రైస్, ఆకు కూరలు, సాంబార్, కూరగాయలు, స్వీట్ పొంగల్ వంటి పదార్థాలను వంట నిర్వాహకులు విద్యార్థులకు వండిపెడుతున్నారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో 347 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉండగా.. అందులో 704 మంది మధ్యాహ్న భోజనం వండుతున్నవారు ఉన్నారు. ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.5.88, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.8.57 చొప్పున నిర్వాహకులకు అందిస్తున్నారు. బిల్లులు గత ప్రభుత్వం హయాంలోనివే, ఈ ప్రభుత్వం ఇంకా పెంచలేదు. కేవలం పాఠశాలల విద్యార్థులకు మాత్రం 44 పైసలు మాత్రమే పెంచింది.


మధ్యాహ్న భోజనం వండుతున్న నిర్వాహకులు

వంట భారంగా మారింది



నిత్యావసర ధరలతో పాటు అన్ని రకాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. మధ్యాహ్న భోజనంలో పిల్లలందరికీ వంట చేయడం భారంగా మారింది. బిల్లులు కూడా సకాలంలో అందకపోవడంతో అవస్థలు పడుతున్నాం. ఇప్పటికీ పాతమెనూ బిల్లులు ఇస్తున్నారు.

– నర్మదా రౌళో, వంట నిర్వాహకురాలు, అయ్యవారిపేట

మూడు నెలలుగా వేతనాల్లేవు



సెప్టెంబర్ నుంచి గౌరవ వేతనాలు చెల్లించలేదు. దీంతో కుటుంబం పోషణ కష్టంగా ఉంది. రోజురోజుకు నిత్యావసరాల ధరలు అమాంతంగా పెరుగుతున్నాయి. వంట ఏజెన్సీలకు ఇవ్వాల్సిన గౌరవ వేతనం రూ.3 వేలు ఇస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పాఠశాలలోనే ఉంటున్నాం. వేతనాలు పెంచాలి.

–సంగారు శోభనమ్మ, భోజన నిర్వాహకురాలు, దొంకూరు

ముగ్గుల పోటీల బ్రోచర్ ఆవిష్కరణ


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కృపారాణి తదితరులు

టెక్కలి: ఆంధ్రప్రదేశ్ అమెరికన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రపంచ స్థాయి ముగ్గుల పోటీలకు సంబంధించిన బ్రోచర్‌ను కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎస్‌వీఆర్‌కే కళాశాలలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కృపారాణి మాట్లాడుతూ.. హిందూ సంప్రదాయాలను గౌరవిస్తూ ఆంధ్రప్రదేశ్ అమెరికన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 5 కేటగిరీలతో పాటు 100 మందికి ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందజేస్తారని ఆమె వెల్లడించారు. మొదటి బహుమతిగా రూ. 25 లక్షల నుంచి చివరి బహుమతి రెండు లక్షల రూపాయలను విజేతలకు అందజేస్తారని కృపారాణి తెలిపారు. డిసెంబర్ ఒకటి నుంచి జనవరి 15వ తేదీ వరకు ఎంట్రీలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు పి.పరమేశ్వరరావు, డాక్టర్ కె.రామ్మోహన్‌రావు, టీబీజే గుప్తా, ఎస్.అన్నాజీ, జి.కృష్ణ, మాధవ్ పాల్గొన్నారు.

దంత పాఠశాలలో ఎంఈవో విచారణ


పాఠశాలలో విచారణ చేస్తున్న ఎంఈవో–2 ఎల్‌వీ ప్రతాప్

టెక్కలి: కోటబొమ్మాళి మండలం దంత ఎంపీయూపీ పాఠశాలలో ఎంఈవో–2 ఎల్‌వీ ప్రతాప్ బుధవారం విచారణ చేశారు. పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు రామారావు, నిర్మళ తదితరులు విద్యార్థులు వరుదు సింహాచలం, గంగిట్ల దిలీప్, కాటస్తుల వెంకటేష్‌ను బెత్తంతో కొట్టి గాయపరిచారు. ఈ సంఘటనపై బుధవారం 'సాక్షి'లో 'బెత్తంతో బాదేశారు' శీర్షికతో కథనం వెలువడింది. దీనిపై స్పందించిన ఎంఈవో ఎల్‌వీ ప్రతాప్ పాఠశాలకు చేరుకుని బాధిత విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను విచారించారు. అనంతరం ఎంఈవో మాట్లాడుతూ.. విద్యార్థి సింహాచలం కాలిపై గాయం ఉండడం వాస్తవమేనన్నారు. సంఘటనపై వివరాలు సేకరించి జిల్లా విద్యా శాఖాధికారి దృష్టికి తీసుకువెళ్లామని చెప్పారు.

విద్యార్థుల క్షేత్ర పర్యటన


బ్యాంకు సిబ్బందితో విద్యార్థులు, సిబ్బంది

కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో ఎకనామిక్స్, కామర్స్ విద్యార్థులు బుధవారం క్షేత్రపర్యటన చేశారు. ఇందులో భాగంగా పలాసలోని ఎస్‌బీఐ, యూనియన్, ఇండియన్ బ్యాంక్‌లను సందర్శించారు. అధ్యాపకులు ఎల్.గణపతిరావు, పి.రమణ, శ్రీనివాస్ పట్నాయక్‌లు విద్యార్థులతో కామర్స్ థియరీ, ప్రాక్టిసులో కామర్సు, బ్యాంకింగ్ ప్రాముఖ్యతను వివరించారు. ఎస్‌బీఐ మేనేజరు వి.సూర్యనారాయణ విదేశీమారక ద్రవ్యాన్ని ఎలా మార్చుకోవాలి, అంతర్జాతీయస్థాయిలో విదేశీ విద్యను అభ్యసించుటలో ఫారెక్స్ విభాగాన్ని ఎలా ఉపయోగించుకోవాలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కామర్స్ అధ్యాపకులు బి.రమేష్, ఆంగ్ల అధ్యాపకురాలు ఆర్.దీపాకుమారి, కంప్యూటర్ అప్లికేషన్ అధ్యాపకులు దీపాకుమారి, రోజా ఉన్నారు.

డయాలసిస్ రోగులకు అన్నదానం


సాయిసత్య సదనంలో కిడ్నీ రోగుల కోసం సిద్ధం చేస్తున్న క్యారేజీ భోజనం

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి పద్మనాభపురంలోని శ్రీసాయిసత్య సదనంలో భోజన ప్రసాద కార్యక్రమాన్ని దాతలు బుధవారం అందించారు. ఏరిస్ కంపెనీ సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా తల్లిదండ్రులు, ఆదరణ లేక ఆశ్రయంలో ఉంటున్న 80 మంది పిండివంటలతో కూడిన భోజన సౌకర్యం కల్పించారు. అనంతరం సమీపంలో ఉన్నటువంటి కిడ్నీ పరిశోధన కేంద్రం, డయాలసిస్, వైద్యసేవలు పొందుతున్న 30 మంది కిడ్నీ బాధితులకు క్యారేజీలతో భోజనాలను అందజేశారు. కార్యక్రమంలో ఏరిస్ సీనియర్ మేనేజర్ కణితి క్రిష్ణారావు, వ్యాపారవేత్త తాళాసు గోవిందు, ఎం.కై లాష్, సాయిసత్య సదనం నిర్వాహకులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం


ఇచ్ఛాపురం రూరల్: ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ఐసీడీఎస్ సిబ్బంది


సోంపేట: ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

ఇచ్ఛాపురం రూరల్: బాల్య వివాహాలను నిర్మూలించడమే మనందరి లక్ష్యమని తహసీల్దార్ ఎస్.వెంకటరావు అన్నారు. 'బాల్ వివాహ్ ముక్త్ భారత్' ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పిల్లలు ఎదగడానికి, వృద్ధి చెందడానికి సురక్షితమైన వాతావరణం అవసరమని అన్నారు. బాల్య వివాహాలను అడ్డుకోవడంలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలతో పాటు మండల స్థాయి అధికారులతో మానవహారం, ప్రతిజ్ఞ చేయించారు. రూరల్ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో కురమాన అప్పారావు, సీడీపీవో పి.నాగరాణి, ఎస్ఐ ఇ.చిన్నంనాయుడు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

సోంపేట: బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని జింకిభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.వేణుగోపాలరావు అన్నారు. బాల్య వివాహాలతో జరగనున్న నష్టంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి, ప్రతిజ్ఞ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు రాణి, రమ్య, సచివాలయం ఆరోగ్య సిబ్బంది శిరీష, నోముల‌మ్మ పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి


టెక్కలి: నందిగాంలో సంకల్పం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

టెక్కలి: మాదకద్రవ్యాల వినియోగానికి దూరంగా యువత ఉండాలని నందిగాం ఎస్ఐ షేక్ మహ్మద్ అలీ అన్నారు. టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌సీసీ ఆధ్వర్యంలో బుధవారం నందిగాంలో సంకల్పం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే దుష్ప్రయోజనాలతు వివరించారు. స్టూడెంట్ అఫైర్ డీన్ శాంతికుమార్ పాల్గొన్నారు.

సోంపేట: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎక్సైజ్ సీఐ కె.బేబీ అన్నారు. సోంపేట పట్టణంలోని కొంచాడ విద్యాసంస్థల్లో మాదక ద్రవ్యాల వినియోగం వలన కలుగు నష్టాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మాదక ద్రవ్యాలు వినియోగించినా, రవాణా చేసిన చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కళాశాల, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలు వద్దు


టెక్కలి: మాట్లాడుతున్న జడ్జి ఎస్‌హెచ్‌ఆర్ తేజ చక్రవర్తి మల్ల


కాశీబుగ్గ: విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న జడ్జి మాధురి

టెక్కలి: బాల్య వివాహాలు వద్దు చదువే ముద్దని టెక్కలి జూనియర్ సివిల్ జడ్జి ఎస్‌హెచ్‌ఆర్ తేజ చక్రవర్తి మల్ల అన్నారు. బాల్ వివాహ్ ముక్త్ కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక గోపినాథపురంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఇంటర్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల్య వివాహాలు చేసిన వారిపై కఠినంగా చర్యలు తీసుకునేలా చట్టాలు కఠినంగా ఉన్నాయన్నారు. బాల్య వివాహాలు వలన భవిష్యత్‌లో ఎన్నో అనర్థాలు ఉన్నాయని జడ్జి పేర్కొన్నారు. పట్టణ, గ్రామాల్లో ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగినట్లు తెలిస్తే తక్షణమే అధికారులకు సమాచారం అందజేయాలని కోరారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.వి.వివేకానంద, న్యాయవాదులు పి.ఆనందరావు, ప్రిన్సిపాల్ బి.ఈశ్వరమ్మ, ఎస్ఐ కె.రాము పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

కాశీబుగ్గ: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని పలాస జూనియర్ సివిల్ జడ్జి యు. మాధురి అన్నారు. ఏపీ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ వారి ఆదేశాల మేరకు పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. బాల్యవివాహాలను అరికడదామని ప్రతిజ్ఞ చేయించారు. ఏపీపీ రమేష్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.విశ్వేశ్వరరావు, సెక్రటరీ పి.వెంకట్రావు, న్యాయవాదులు పీజీ రాజారత్నం, బీకేఆర్ పట్నాయక్, ఎల్.చంద్రశేఖరరావు,బి.రవికుమార్, కె.రజినికుమార్, జి ప్రభాకరరావు, టి.శ్యామ్, బి.కాళిదాసు, కళాశాల ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి ఉన్నారు.

సంక్షిప్తంగా...

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేపడుతున్నందున గురువారం ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు ఏఈ గోవిందరావు తెలిపారు. ఇచ్ఛాపురం పట్టణ పరిధిలోని గోర్జివీధి, కార్జీవీధి, ఆస్పత్రి రోడ్డు, మంగళవారం పేట, రథంవీధి, గొల్లవీధి, ఫకీర్‌పేట, వీకేపేట, రత్తకన్న, చక్రపాణివీధులకు సరఫరాను నిలిపి వేస్తామని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నేడు పూలే వర్ధంతి కార్యక్రమం

టెక్కలి: టెక్కలి ఆదిత్య కల్యాణ మండపంలో గురువారం మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం పది గంటలకు నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలంతా హాజరు కావాలని కోరారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు

సోంపేట: రబీ సీజన్‌లో పండించే టమాటా పంట అధిక దిగుబడులు సాధించాలంటే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కృషివిజ్ఞానకేంద్ర శాస్త్రవేత్తలు హరి, అనూష అన్నారు. బెంకిలి గ్రామంలో కేవీకే ఆధ్వర్యంలో బెంకిలి, జింకిభద్ర గ్రామాల టమాటా రైతులకు శిక్షణ కార్యక్రమంతో పాటు వ్యవసాయ సహాయ సంచాలకు కె.జగన్మోహనరావు ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది

చలో శ్రీకాకుళం విజయవంతం చేయండి

కాశీబుగ్గ: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 29న చేపట్టనున్న చలో శ్రీకాకుళం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మందస మండల ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ పిలుపునిచ్చింది. ఈ మేరకు వీరగున్నమ్మపురంలో బుధవారం ప్రచార కార్యక్రమం చేపట్టారు. అధ్యక్షులు కొత్తపల్లి మోహనరావు, కార్యదర్శి సంక కాళిదాసు, ఉపాధ్యక్షులు బడియా వల్లభరావు పాల్గొన్నారు.

30న మున్సిపల్ సమావేశం

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపల్ సమావేశాన్ని ఈ నెల 30వ తేదీన నిర్వహిస్తున్నట్లు కమిషనర్ నడిపేటి రామారావు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ బి.గిరిబాబు అధ్యక్షతన ఉదయం 11 గంటలకు ప్రారంభం కానున్న సమావేశానికి సభ్యులందరూ విధిగా హాజరు కావాలని కోరారు.

థర్మల్ ఉద్యమకారులపై కేసులు ఎత్తివేయాలి

సోంపేట: సోంపేట థర్మల్ విద్యుత్ కర్మాగారం నిర్మాణానికి వ్యతిరేకరంగా జరిగిన పోరులో ఉద్యమకారులపై నమోదు చేసిన కేసులు ఎత్తివేయాలని పర్యావరణ పరిరక్షణ సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌ను బుధవారం కలిసి సమస్యను విన్నవించారు. విప్‌ను కలిసిన వారిలో పర్యావరణ పరిరక్షణ సంఘం అధ్యక్షుడు డాక్టర్ కృష్ణమూర్తి, నాయకులు బార్ల సుందరరావు, సనపల శ్రీరామమూర్తి, వైశ్యరాజు నాగు, ఉత్తరాల వెంకన్న ఉన్నారు.

తెగిపడిన విద్యుత్ తీగలు!

టెక్కలి రూరల్: స్థానిక గోపినాథపురం వద్ద బుధవారం 11కేవీ విద్యుత్ తీగలపై చెట్టుకొమ్మలు పడడంతో తెగిపోవంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది. గోపినాథపురం రైల్వేగేటు సమీపంలోని ఒక బాదం చెట్టుకొమ్మలు పడడంతో సమ్య తలెత్తింది. దీంతో గోపినాథపురం, మెయిన్ రోడ్డు, కోదండరామవీధి, బీసీ కాలనీ, కచేరివీధి, చిన్నబజారు ప్రాంతాకు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న విద్యుత్‌శాఖ సిబ్బంది మరమ్మతులు చేపట్టారు.

వృత్తి విద్యపై అవగాహన కలిగి ఉండాలి

సోంపేట: విద్యార్థులు చదువుతోపాటు వృత్తి విద్యపై అవగాహన కలిగి ఉండాలని స్థానిక ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ చిన్నాజీ వర్మ అన్నారు. ఆదర్శ పాఠశాల, కళాశాల విద్యార్థులకు బ్యూటీ అండ్ వెల్‌నెస్ విభాగంలో పారిశ్రామిక సందర్శన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. వృత్తి ఉపాధ్యాయురాలు టి.శ్రావణి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పశువుల రవాణాను అడ్డుకున్న పోలీసులు

కంచిలి: పశువుల అక్రమ రవాణాను కంచిలి పోలీసులు మంగళవారం అర్ధరాత్రి తర్వాత అడ్డుకున్నారు. జాతీయ రహదారిలో వేర్వేరు చోట్ల నాలుగు వాహనాలను పట్టుకున్నారు. ఒడిశా రాష్ట్ర పరిధి కొణిసి గ్రామం నుంచి నాలుగు మహీంద్రా పిక్‌అప్ వాహనాల్లో 24 గేదెలను అలమండ సంతకు తరలిస్తుండగా వాహన తనిఖీల్లో భాగంగా వాటిని స్థానిక ఎస్సై పి.పారినాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది పట్టుకున్నారు. వాహనాలతోపాటు 24 పశువులను స్వాధీనం చేసుకొన్నారు. వాటిని తరలిస్తున్న 8 మందిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సీజ్ చేసిన పశువులను కొత్తవలస గోశాలకు పంపినట్లు తెలిపారు.

పీఎంఏవై ఇళ్లను తక్షణమే నిర్మించాలి

పలాస: పలాస మండలంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద మంజూరైన ఇళ్లను వెంటనే నిర్మించాలని సోషల్ డెవలప్‌మెంటు స్పెషలిస్టు సి.హెచ్.మల్లేశ్వరరావు చెప్పారు. మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో బుధవారం మహిళా సమాఖ్య అధ్యక్షురాలు జి.శాంతమ్మ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.ఉపాధ్యక్షురాలు పార్వతి, కోశాధికారి త్రివేణి పాల్గొన్నారు.

బాలికా వికాసంతో మెరుగైన సమాజం

కవిటి: కిశోర బాలికా వికాసంతో మెరుగైన సమాజం సాధ్యమని తహసీల్దార్ బి.మురళీ మోహనరావు అన్నారు. స్త్రీ, శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కవిటి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కిశోర వికాసం చైతన్యర్యాలీ, మానవాహారం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు.